ప్రజాశక్తి
శనివారం 27 మే 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

క్రీడాజ్యోతితో మంత్రి రోజా

వేటాడినట్లు ఆడాలి..

- బంగారు పతకమే లక్ష్యం కావాలి
- పంగులూరుకు ఇండోర్ స్టేడియం మంజూరు చేస్తాం
- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్. కె.రోజా

ప్రజాశక్తి-పంగులూరు

'ఆట ఆడితే వేటాడినట్లు ఆడాలి.. గోవా గడ్డపై ఆంధ్ర వాడి సత్తా చూపాలి.. మనమేంటో మన ఆట ఏంటో భారతదేశం మొత్తం తెలిసే విధంగా ఆడి, బంగారు పతకం తీసుకురావాలి.. మన లక్ష్యం బంగారు పతకం.. మన ధ్యేయం బంగారు పతకం.. ప్రతి క్రీడాకారుడూ ఇదే లక్ష్యంతో ఆడి.. రాష్ట్ర ప్రజలందరికీ ఆనందాన్ని పంచాలి' అని ఖోఖో క్రీడాకారులనుద్దేశించి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. 37వ జాతీయ క్రీడలు జరిగే గోవా వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో పురుషుల జట్టుకు కోచింగ్ క్యాంపు ప్రారంభించేందుకు శుక్రవారం సాయంత్రం ఆమె పంగులూరు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో క్రీడాకారులనుద్దేశించి ఆమె మాట్లాడారు. వైసిపిలో ఉండటం తన అదృష్టమన్నారు. ఖోఖో క్రీడ ద్వారా జాతీయ స్థాయిలోనే గుర్తింపు పొందిన పంగులూరు గ్రామానికి, త్వరలో ఇండోర్ స్టేడియం మంజూరు చేస్తామని, త్వరలో తానే శంకుస్థాపన చేస్తానని చెప్పారు. ఇప్పటికే అనేకమంది జాతీయ, అంతర్జాతీయ, ▶ 2లో

మార్కెట్లోకి నకిలీ పత్తి విత్తనాలు

- గ్రామాల్లో జోరుగా లూజు విత్తనాల వ్యాపారం
- కర్నూలు కేంద్రంగా సరఫరా అవుతున్న వైనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన యర్రగొండపాలెం నియోజకవర్గంలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం యథేచ్ఛగా సాగుతోంది. అసలు ప్యాకింగ్‌లో ఏ మాత్రం తేడా కనిపించదు. లోతుగా పరిశీలిస్తే తప్ప అది నకిలీ ప్యాకింగ్‌గా గుర్తించలేం. వర్షాకాలం సీజన్ ప్రారంభం కంటే ముందే నకిలీ పత్తి విత్తనాల తయారీకి శ్రీకారం చుడతారు. ఏ మాత్రం తేడా లేకుండా రంగు రంగుల బొమ్మలతో ప్యాకింగ్ తయారుచేస్తారు. ఈ విత్తనాల ద్వారా మంచి దిగుబడి వస్తుందని రైతులను బాగా నమ్మిస్తారు. రైతులు రంగు రంగుల ప్యాకింగ్‌లో చూసి మోసపోతున్నారు. వాటిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. తర్వాత అవి నకిలీ విత్తనాలనే విషయాన్ని గ్రహిస్తున్నారు. తీరా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో ముందస్తు అదునుగా ఆరు వేల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి పైరును సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో యర్రగొండపాలెం మండలంలో ఐదు వేల ఎకరాలు, దోర్నాల మండలంలో మూడు వేల ఎకరాలు, త్రిపురాంతకం మండలంలో మూడు వేల ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో మూడు వేల ఎకరాలు, పెద్దారవీడు మండలంలో మూడు వేల ఎకరాలు.. ఇలా మొత్తం కలిపి మరో 17 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. వారి అవసరాన్ని ఆసరాగా తీసుకొని నకిలీ పత్తి విత్తనాలను అంటగట్టేందుకు కొందరు ఈ పాటికే గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతులను కలుసుకొని మాయమాటలు చెబుతున్నారు. నకిలీ విత్తనాలను అంటగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

చాప కింద నీరులా..

ప్రతి ఏడాదీ ప్రభుత్వం నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నా పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతున్నారు. ప్రతి ఏడాదీ కోట్లాది రూపాయల విలువైన నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి రావడం, రైతులు కొనుగోలు చేయడం, మోసపోవడం పరిపాటిగా మారింది. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. అప్పుడే నకిలీ విత్తనాలను సరఫరా చేసేందుకు దళారులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో నకిలీ విత్తనాల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. నల్ల, ఎర్ర నేలలతో విస్తరించి ఉండడంతో స్వల్ప, దీర్ఘకాలికమైన పంటల సాగుకు అనువుగా ఉంది. సహజంగా పత్తి 180 రోజుల పంట. ఎర్ర నేలల్లో 140 రోజుల వ్యవధిలోనే పంట చేతికొస్తుంది. దీనిని దష్టిలో ఉంచుకుని కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. నకిలీ విత్తనాలను కమీషన్ ఏజెంట్ల ద్వారా రైతులకు పంపిణీ చేసే ప్రయత్నం కొనసాగుతున్నట్లు సమాచారం. రూ.500 నుంచి రూ.600 వరకు లభించే 450 గ్రాములు కలిగిన విత్తన ప్యాకెట్‌ను (అప్పు కింద) రూ.800లకు అంటగట్టే దందా సాగుతోంది. పత్తి చేతికొచ్చిన తర్వాత రూ.100కు రూ.25 వడ్డీతో సహా చెల్లించాలనేది ఇందులో ప్రధాన ఒప్పందం.

గ్రామాల్లో లూజు విత్తనాల వ్యాపారం..

వివిధ గ్రామాల్లో లూజు పత్తి విత్తనాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. లూజు పత్తి విత్తనాలు రూ.800 ప్రకారం తీసుకొని రైతులు మోసపోతున్నారు. ఎలాంటి ప్యాకింగ్ లేకుండా లూజు పత్తి విత్తనాల వ్యాపారం పలుకుబడి ఉన్నా పెద్ద రైతుతో కొనసాగిస్తున్నారు. చివరకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులకు ఆత్మహత్యలు తప్పడం లేదు. కర్నూలు జిల్లాలోని ఆదోని ప్రాంతం ▶ 2లో

ఏసీబీకి చిక్కిన సీనియర్ అకౌంటెంట్

రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ట్రెజరీ ఉద్యోగి

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం ట్రెజరీ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఘటన శుక్రవారం జరిగింది. అర్ధవీడు మండలం, రంగాపురం సచివాలయ ఉద్యోగి జాజా వెంకట రవీంద్ర తనకు సంబంధించిన జీతాల అరియర్స్, బకాయిల బిల్లుల కోసం కంభం ట్రెజరీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దూదేకుల నాసర్‌వలీని సంప్రదించాడు. ఆయన బిల్లులు మంజూరు చేయాలంటే రూ.15 వేలు లంచం ఇవ్వాలని రవీంద్రను డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని రవీంద్ర ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల ▶ 2లో

ఏసీబీ అధికారుల అదుపులో నాసర్‌వలీ

పంథా మార్చిన 'బాలినేని'

- మళ్లీ యథాతథదంగా 'గడపగడపకూ..'
- నియోజకవర్గంపైనే పూర్తిస్థాయి కేంద్రీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి సీనియర్ నేత బాలినేని శ్రీనివాస రెడ్డి పంథా మార్చుకున్నారా? అధిష్టానం పెద్దలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన ఆయన, వారం రోజుల పాటు జిల్లాకు దూరంగా ఉన్న ఆయన తిరిగి యథాతదంగా నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఎందుకు కేంద్రీకరించారు? ఆయన భవిష్యత్ వ్యూహం ఏమిటనే దానిపై ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పార్టీలోనే ఉంటూ పోరాటం సాగిస్తామని చెప్పిన ఆయన అందుకు తగిన వ్యూహం అమలు చేస్తున్నారని తెలుస్తోంది. బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలతో ఇటీవల వైసిపిలోనే తీవ్ర అనిశ్చితి నెలకొనడంతో పాటు ఆయనపైనే పలు రకాలుగా ఊహాగానాలు వచ్చాయి. చివరికి పార్టీ మారుతున్నారనే ప్రచారం కూడా తారాస్థాయికి చేరింది. వారం రోజుల పాటు బాలినేని వ్యవహారం వైసిపిలోనే కాకుండా ఇతర పార్టీల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. అధిష్టానంలో కొందరు తనకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారని, తనకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని బాలినేని ఇటీవలే ఆరోపించారు. వెంటనే హైదరాబాద్ వెళ్లారు. ఆయన వ్యవహారం పెద్దచర్చకు దారితీసింది. పార్టీలోనూ ఆయన నడకపైనా సందిగ్ధం నెలకొంది. బాపట్లలో జరిగిన సిఎం జగన్ సభకూ వెళ్లలేదు. దీంతో ఆయన పార్టీ మారుతున్నారని కొందరు.. ఇతర పార్టీలతో టచ్‌లో ఉన్నారని ఇంకొందరు వైసిపి నేతలే ప్రచారం చేశారు. అయితే పార్టీ కోసం తొలి నుంచీ ఎన్నో రకాలుగా నష్టపోయిన తాను పార్టీలోనే ఉంటూ కార్యకర్తలు, తనను నమ్ముకున్నవారికి న్యాయం జరిగేలా చూస్తానని బాలినేని చెప్పి ఉన్నారు. సిఎం జగన్‌కు తప్ప ఎవరికీ భయపడేది లేదని హెచ్చరికలు కూడా చేశారు. ఈ హెచ్చరికలు స్వయంగా తన బంధువును ఉద్దేశించి చేసినవేని చెప్పాల్సిన అవసరం లేదు. బాలినేని ఉదంతం పార్టీలోనూ కొంత గందరగోళానికి దారితీసింది. ఈ ఘటనతో బాలినేనికి ఎవరు అండగా ఉన్నారు? ఎవరు ▶ 2లో

'పరీక్ష' భయం..చంపేసింది.!

- రైలు కింద పడి విద్యార్థిని ఆత్మహత్య
- సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించలేనని.. తీవ్ర మనస్తాపం
- ఈపూరుపాలెం రైల్వే ట్రాక్ వద్ద ఘటన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ సునీత, కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

సివిల్స్ పరీక్ష సరిగ్గా రాయలేమోనని, ఉత్తీర్ణత సాధించలేనని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని మనోవేదనతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఈపురుపాలెం రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది.

శ్రావణి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పోతుల సునీత, కరణం వెంకటేష్, ఇన్‌సెట్లో శ్రావణి (ఫైల్)

ప్రస్తుత పద్మశాలీయ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గోలి కుమారి, ఆనంద్ దంపతుల కుమార్తె శ్రావణి(27). శ్రావణి ఢిల్లీలో సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంది. ఈ నెల 28న విజయవాడలో పరీక్ష రాయాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయింది. పరీక్ష సరిగ్గా రాయలేమోనని.. ఉత్తీర్ణత సాధించలేనని భావించి.. ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా ▶ 2లో

పంథా మార్చిన 'బాలినేని'

(మొదటిపేజీ తరువాయి)

ఆయనకు దూరంగా ఉన్నారనేదీ తేలిపోయింది. సీనియర్ ఎమ్మెల్యే కరణం బలరాం ఈ వ్యవహారంలో బాలినేనికి పూర్తిస్థాయిలో అండగా నిలిచారని సమాచారం. భవిష్యత్‌లో ఎలా ముందుకు పోవాలి? ప్రస్తుతం ఏం చేయాలనే దానిపై ఇద్దరి మధ్య చర్చ సాగినట్లు తెలుస్తోంది. ఏదేమైనా తొందరపాటు నిర్ణయాలు మంచివి కావనే సలహా సీనియర్ నేత ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. ఇక బాలినేనిపై రకరకాలుగా ప్రచారాలు సాగాయి. అవన్నీ ఏది నిజం.. ఏది అబద్ధం అనేదీ స్పష్టత లేని వ్యవహారంగా మారింది. అయితే ఇప్పుడు బాలినేని మళ్లీ నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో కేంద్రీకరించారు. ఇది కూడా వ్యూహాత్మకమేనంటున్నారు. దూరంగా ఉంటే మరో చర్చకు అవకాశం ఉంటుందని భావించారు. వెంటనే పంథాను మార్చుకున్నారు. అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రైవేటు కార్యక్రమాలు, పెళ్ళిళ్లు వంటి కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. నియోజకవర్గంపైనే ఎక్కువ దృష్టి సారించారు. క్యాడర్‌కు అందుబాటులో ఉంటూ భవిష్యత్ రాజకీయాలపైనే చర్చిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని ముఖ్యనేతలూ కొంత ఊరట చెందారు. అధిష్టానంలోని పెద్దల వ్యవహారాన్ని పక్కనబెట్టి తిరిగి రోజువారీ కార్యక్రమాల్లో కొనసాగుతున్నారనే చర్చ సాగుతోంది. పార్టీలో పెద్దలతో గొడవలు ఎలా ఉన్నా ఇక్కడ మళ్లీ ఎప్పటిలాగే పాలనావ్యవహారాల్లో నిమగ్నమయ్యారని భావిస్తున్నారు. కలెక్టర్‌తో కలిసి కొన్ని అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. పట్టణంలో పలు కార్యక్రమాల్లో ఉన్నారు. వాలంటీర్ల సత్కారంలోనూ పాల్గొన్నారు. అన్నిటికన్నా ముఖ్యమైన గడపగడపకూ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. గోపాల్‌నగర్‌లో రెండు రోజులుగా తిరుగుతున్నారు. దీంతో ఇప్పటివరకూ గందరగోళంలో ఉన్న ఒంగోలు పట్టణ ముఖ్యనేతలు కూడా కొంత సర్దుకున్నట్లయింది. బాలినేనిపై రకరకాలుగా సాగిన ప్రచారాలకు తెరపడిందనే చర్చ కూడా సాగుతోంది.

వేటాడినట్లు ఆడాలి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రస్థాయి క్రీడాకారులు తయారుచేసిన ఈ గ్రామానికి, ఇండోర్ స్టేడియం ఒక వరమని, దాని ద్వారా మరింత మంది క్రీడాకారులను తయారుచేసే అవకాశం ఉంటుందని చెప్పారు. యూత్ ఐకాన్ జగనన్న పాలనలో మరో యూత్ ఐకాన్ బాచిన కష్ణ చైతన్యను అద్దంకి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని చెప్పారు. గ్రామంలో తనకు జరిగిన సన్మానాన్ని, ఆడపడుచుగా తనను గౌరవించిన తీరును, తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనని, తన జీవిత పుస్తకంలో ఇది ఒక పేజీ లాంటిదని రోజా అన్నారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించిన ఆమె ఖోఖో క్యాంపు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జాతీయస్థాయిలో ఖోఖో క్రీడాకారులుగా పేరుందిన అట్ల శివనాగిరెడ్డి, భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పాలకీర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామరెడ్డి, శివారెడ్డిని మంత్రి రోజా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్‌భాషా, మాజీ శాసనసభ్యులు బాచిన చెంచుగరటయ్య, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణచైతన్య, స్పోర్ట్స్ అథారిటీ ఎండి హర్షవర్ధన్, ఆర్డీవో సరోజినీ, స్టెప్ సీఈవో పల్లవి, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, పంగులూరు గ్రామ సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జడ్పిటిసి రాయిని ప్రమీల, ఎంపిటీసీ నూతలపాటి రాములు, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అకౌంటెంట్

(మొదటిపేజీ తరువాయి)

సూచనల మేరకు శుక్రవారం రవీంద్ర నాసర్‌వలీకి రూ.15 వేలు ఇస్తుండగా అక్కడే కాపుకాసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాసర్‌వలీని నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు.

సంపద తయారీ కేంద్రంలో తనిఖీ

సంపద తయారీ కేంద్రంలో పరిశీస్తున్న మాధవి

ప్రజాశక్తి-జరుగుమల్లి

రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన వర్మీ కంపోస్టు ఎరువును విక్రయించాలని జరుగుమల్లి మండల ప్రత్యేక అధికారి గ్రంధి మాధవి చింతలపాలెం సచివాలయ కార్యదర్శి కిషోర్‌ను ఆదేశించారు. వర్మీ కంపోస్టు ఎరువు చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద అందుబాటులో ఉందన్నారు. రైతులు వర్మీ కంపోస్టును ఎరువును వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం చింతల పాలెం గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్ గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శిను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రామకృష్ణ, హౌసింగ్ డిఇ జయరాం, తహశీల్దారు ఉషారాణి, హౌసింగ్ ఎఇ అవినాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, వైసిపి నాయకులు బెల్లం సత్యన్నారాయణ, సచివాలయ కార్యదర్శి కిషోర్ సర్పంచి వేల్పుల హరిబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం క్రిష్టంశెట్టిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఉప్పలపాడులో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో చిక్కుడు పంటకు డ్రోన్ సహాయంతో పురుగు మందులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుడు బాలాజీ నాయక్ డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నేటి ఆధునిక యుగంలో పంటలసాగులో పురుగు మందులు పిచికారీ చేయటానికి ఖర్చు ,సమయం ఆదా చేసేకొనేందుకు డ్రోన్లు అందుబాటు లోకి వచ్చినట్లు తెలిపారు. ఎకరా విస్తీర్ణంలోని పంటకు పది లీటర్ల పురుగుమందును తొమ్మిది నిమిషాల్లో డ్రోన్ పిచికారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, రాచర్ల మండలాల వ్యవసాయాధికారులు వై.విజయభాస్కర్ రెడ్డి, అబ్దుల్ రఫిక్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి నకిలీ పత్తి విత్తనాలు

(మొదటిపేజీ తరువాయి)

మీదుగా నకిలీ విత్తనాల అక్రమ రవాణా ఈ ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్నట్లు సమాచారం.

టాస్క్ ఫోర్స్ కమిటిలను ఏర్పాటు చేయాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతి ఏటా పశ్చిమ ప్రాంత రైతులు నకిలీ పత్తి విత్తనాలను కొని నష్టపోతున్నారు. పంటల సాగు విధానంలో వ్యవసాయ శాఖది అత్యంత కీలకమైన పాత్ర. దుకాణాలకు అనుమతులివ్వడం, సరుకుల వివరాలను బోర్డులపై ప్రదర్శించడం, రసీదులు ఇవ్వడం, విత్తనాలను తయారు చేసిన కంపెనీల వివరాలతో పాటు వాటి వాడకానికి ఉన్న గడువు, విత్తనాలు వేస్తే వచ్చే మొలక శాతం లాంటి కీలకమైన అంశాలన్నింటినీ పరిశీలించాల్సింది వ్యవసాయ శాఖ మాత్రమే.. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలి.

నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దు

నీరజ, సహాయ వ్యవసాయ సంచాలకురాలు, యర్రగొండపాలెం

రైతులు కొనుగోలు చేసిన పత్తి విత్తనాల్లో ఎలాంటి అనుమానాలున్నా ఆయా మండలాల్లోని వ్యవసాయ కార్యాలయాల్లో తెలియజేయాలి. గ్రామాల్లో ఎవరైనా లూజు పత్తి విత్తనాలు గానీ, నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతుంటే మాకు సమాచారం అందించాలి. అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. నకిలీ పత్తి విత్తనాలను కొని మోసపోవద్దు.

'పరీక్ష' భయం..చంపేసింది.!

(మొదటిపేజీ తరువాయి)

వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రావణి మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోలి శ్రావణి మృతికి ఎమ్మెల్సీ పోతుల సునీత, చీరాల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ సంతాపం తెలిపారు. హాస్పిటల్ వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, డాక్టర్ అమృతపాణి, పలువురు నాయకులు.తదితరుల. శ్రావణి తల్లిదండ్రులకు సానుభూతి తెలిపారు.

ట్రాక్టర్లు పంపిణీ

దొనకొండ : వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా మండలానికి మూడు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. ఈ ట్రాక్టర్లను ఎఒ లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. చందవరం గ్రామానికి వైష్ణవి రైతు మిత్రగ్రూపుకు, కొచ్చెర్లకోటకు చెందిన వీరాంజనేయ రైతు మిత్ర గ్రూపు,శ్రీ వెంకటేశ్వర రైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్, రోటావేటర్, గుంటక బ్లేడ్, స్ప్రేయర్, ట్రక్కు అందజేశారు.

CHANGE OF NAME

I, **MASEERA SHAIK**, W/o. **MOHAMMED RAFI SHAIK**, Resident of D.no:11-165, PODILI, Prakasam District - 523240, Andhra Pradesh. Have Changed my name to **SHAHIN GOUSE SHAIK** Hereafter my name is known as **SHAHIN GOUSE SHAIK.**

జనరల్ నోటీస్

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టులో,ఒంగోలు

G.W.O.P.No. 11/2023

మధ్య:-
కోమంట్ల సురేష్‌రెడ్డి ....పిటీషనర్
మరియు
జనరల్ పబ్లిక్ .... రెస్పాండెంట్స్

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నంబరు పిటిషన్లో మైనర్లు. అయినటువంటి 1)కోమట్ల భాగ్యశ్రీ, 2) కోమట్ల గీతాంజలికి చెందిన షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు పై నంబరు పిటిషన్ను పిటీషనర్ దాఖలు చేసిఉన్నారు. సదరు విషయమై ఎవరికైనా ఏలాంటి ఆక్షేపణలు ఉన్నయడల తేది. 26-06-2023న ఉదయం 10.30 ని.లకు మీ ఆక్షేపణలు కోర్టు వారిముందు తెలుపు కోవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా (పాత) - బాపట్ల జిల్లా (ప్రస్తుత) -చీరాల సబ్ రిజిస్ట్రార్ - చీరాల పురపాలక సంఘ ఏరియా -చీరాల గ్రామం చీరాల పాత మున్సిపల్ వార్డు నెం. 9, ప్రస్తుత వార్డు నెం. 1-T.S.ward No.9- బ్లాకు నెం. 2 - T.S.No.13/1-D.No1-27-17 స్థలం వైకుంఠపురం దక్షిణభాగమున గల 340 చదరపు గజాలలోని 106.77చదరపు గజాలు లేదా 89.26చదరపు మీటర్లు ఈజ్మెంట్ హక్కులతో కూడిన ఖాళీ స్థలంకు హద్దులు.

తూర్పు : 9 అడుగుల జాయింటు దారి 30ft,
దక్షిణం : కోమట్ల వెంకటేశ్వర రెడ్డి ఆస్థి 31.03ft,
పడమర : కోమట్ల రంగా రెడ్డి స్థలం 31.06 ft,
ఉత్తరం : సిద్దాన సింహాచలం, ఉప్పు ఎల్లమంద, బండి ధనలక్షి గార్ల స్థలం 31.03 ft

// శ్రీ కోర్టువారి అనుమతితో //

తేది : 26-05-2023

ఇట్లు:
Dr. S.S.S.జయరాజు, Advocate,
High Court of AP. 9440235617
M.బలరామ్ : 8247096171.
I.పవన్ కుమార్ : 9703152119
పిటిషనర్ లాయర్స్, ఒంగోలు.

పదో తరగతి మార్కుల లిస్టు పోయినది

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పట్టణంలోని ఇశ్రాయేలుపేటకు చెందిన చేదూరి దేవమణి తండ్రి సుందరరావు ఈ నెల రెండో తేదిన యర్రగొండపాలెం నుంచి మార్కాపురం వెళ్లడానికి యర్రగొండపాలెం బస్టాండ్ వద్ద వేచి ఉండగా బ్యాగ్ పోయినది. అందులో 1716603574 నెంబర్ గల పదో తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు,టిసి ఉంది. ఎంత వెతికినా అవి దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

ఇట్లు
చేదూరి దేవమణి,తండ్రి సుందరరావు
ఇశ్రాయేలుపేట, యర్రగొండపాలెం,ప్రకాశం జిల్లా
సెల్ నెంబర్ 9494092625,8074058751

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: BAPATLA.

E.P. No.31/2019
in
O.S. No.222/2017.

Muppiri Rajasekhar Babu..........DHR.
And
1) Kagitha Marthamma,
2) Kanaparthi Mariyamma,
3) Gera James,
4) Gera Chitti Babu,
5) Gera Maruthi Rao .....J.D.R's

పై నెంబరు E.P లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా J.D.R. యొక్క స్థిరాస్తిని పై కోర్టు వారిచే ది:15- 6-2023 వ తేదీన ఉదయం 10:30 ని.. లకు లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

నరసరావుపేట రి.డి, బాపట్ల స.డి. బాపట్ల మునిసిపాలిటీ, పాత వార్డ్ నెం.4, కొత్త వార్డ్ నెం.6,లోకాలిటీ నెం.2, జమేదారు పేట, లోని పడమర బాపట్ల గ్రామం తాలూకు D.No. 600/10 , D.No.598/10 లో చ.గ 96.8 లు స్థలము ఇందు లోని డోర్ నెం.2-6-26 . అసెస్మెంటు నెం. 1019008786 గల రేకుల ఇల్లు స్థలము నకు హద్దులు:

తూర్పు : గేరాజేమ్స్ గారి ఆస్థి హద్దు.
దక్షిణం : మున్సిపల్ రోడ్డు హద్దు.
పడమర : గుడిపల్లి మంగమ్మ ఇల్లు స్థలము.
ఉత్తరం : చిరంజీవులు దుర్గా ప్రసన్న ఇల్లు స్థలము.

ఈ నాలుగు హద్దుల మధ్య య.0.02 సెంట్లు లేక చ.గ.96.8 లు లేక చ.మీ.81.31ర్లు స్థలమునూ ఇందులోని సిమెంట్ రేకుల ఇల్లు, ఈ ఇంటికి అమర్చిన యావత్తు కలపసామాను, కరెంటు మీటరు ఫిట్టింగ్స్.. ఈ ఆస్తికి దక్షిణము వైపు గల మున్సిపల్ రోడ్డులోనుండి రాకపోకల మార్గపు హక్కులతో సహా..

D.Hr. Value : Rs.5,00,000/-
Ammen Value:Rs.600000/-
వేలం వాయిదా తేది : 15-06-2023.
ఫర్దర్ హియరింగ్ :తేది : 22-06-2023.

నోట్: E.C దాఖలా ది.22-08-2016 న డాక్యుమెంట్ నెం. 3679/2016 SRO బాపట్ల లో గేరా సుబ్బారావు గారు మీదసల ఆంజనేయులు గారికి Regd తనఖా చేసియున్నారు. సదరు తనఖాకు లోబడి వేలంపాట జరుగును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్యులతో)

ఇట్లు
విన్నకోట సత్యప్రసాద్,
అడ్వకేట్,
బాపట్ల - 522101.

రేపల్లె పురపాలక సంఘము
ఇ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

రేపల్లె పురపాలక సంఘములో సాధారణ నిధుల నుండి 16 వర్క్ లు ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్లాట్ ఫమ్ పై టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు టెండర్లు సంబందించిన వివరములు www.apeprocurment.gov.in వెబ్ సైట్ నందు చూడ వచ్చును.

ఎస్టిమేట్ విలువ	: రూ.74,60 లక్షలు
బిడ్ డాక్యూమెంట్లు డౌన్ లోడ్ ప్రారంభం తేది	: ది.27-05-2023 సా.గం.03.00ల నుండి
బిడ్ డాక్యూమెంట్లు డౌన్ లోడ్ ముగింపు తేదీ	: ది.03-06-2023 సా.గం.03.00ల వరకు.
బిడ్ దాఖలు ముగింపు తేదీ..	: ది.03-06-2023 సా.గం.03.30ల వరకు
బిడ్ ఓపెన్ చేయు తేది	: ది.03-06-2023 సా.గం.04.00ల నుండి

(ఆర్.ఓ.సి.నెం.891/2014/ఇ1

సంప్రదిచవలసిన చిరునామా: కమీషనర్
రేపల్లె పురపాలక సంఘము,
రేపల్లె, బాపట్ల జిల్లా,
ఆంధ్రప్రదేశ్,
సెల్ నెం: 9849907936.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టిప్పర్

ట్యాంకర్‌లోని నూనె నేలపాలు ● నూనెపై జారి ప్రమాదాలకు గురైన పలు వాహనాలు ● ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు

జాతీయ రహదారిపై వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను మండలంలోని వల్లూరు సమీపంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌కు పెద్ద రంధ్రం ఏర్పడి దాదాపు 30 వేల లీటర్లకు పైగా నూనె జాతీయ రహదారిపై నేల పాలైంది. దీంతో వల్లూరు జాతీయ రహదారిపై 3 కిలోమీటర్లకు పైగా ట్యాంకర్‌లోని నూనె అంతా పడిపోవడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు జారిపోయి అదుపుతప్పి వెంటవెంటనే ప్రమాదాలకు గురయ్యాయి. అందునా వేకువఝాము కావడంతో రహదారిపై కారిపోయిన నూనెను గుర్తించలేక పలు ద్విచక్ర వాహనాలతో పాటు మూడు లారీలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, మరో రెండు మినీ లారీలు ప్రమాదానికి గురయ్యాయి. ట్రావెల్స్ బస్సు ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రమాదంలో బస్సు క్లీనర్‌తో పాటు మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. జాతీయ రహదారిపై పడిపోయిన నూనెను తొలగించి ప్రమాదాలను నివారించేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొని నుజ్జు నుజ్జయిన ట్రావెల్స్ బస్సు

సొసైటీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పిఎసిఎస్ స్థలం ఆక్రమిస్తే శిక్షార్హులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన అద్దేపల్లి గోడౌన్ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరి స్తూ ఆ స్థలంలో శుక్రవారం ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశారు. పిఎసిఎస్ గోడౌన్ తొలగింపు శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సొసైటీ అధికారులు స్పందించారు. పూర్తిగా తొలగించబడిన స్థలంలో ఈ బోర్డును సిఇఒ శ్రీనివాసరావు ఏర్పాటు చేయించారు. కాగా సొసైటీ అనుమతి లేకుండా అక్రమంగా అధికార బలంతో గోడౌన్ తొలగించిన వారిపై ఎలాంటి చర్యలు చేపడతారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా సిఇఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన స్థలం వెనుక భాగంలో ముస్లిములకు చెందిన స్థలంలో మదర్సాను నిర్మించాలని భావించి దానికి రహదారి వైపు అడ్డంగా ఉన్న గోడౌన్‌ను తొలగించి తగిన ఏర్పాట్లతో మరో గోడౌన్ నిర్మించుకోవచ్చునని కొందరు నాయకులు చెప్పారన్నారు. అయినప్పటికీ బ్యాంక్ ఉన్నతాధి కారుల అనుమతి లేకుండా తొలగించటానికి వీలులేదని వారికి చెప్పినట్లు తెలిపారు. కానీ తమకు తెలియకుండానే తొలగించారని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని సిఇఒ శ్రీనివాసరావు అన్నారు.

పోలీసుల అదుపులో మూడు లారీలు

ప్రజాశక్తి-వేటపాలెం

సామాజిక తనిఖీల్లో భాగంగా స్థానిక 216 జాతీయ రహదారిపై ఓవర్ లోడ్‌తో వెళ తున్న మూడు లారీలను శు క్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వేబిల్లులు పరిశీలించి లారీలను కాటకు తరలించారు. అక్కడ ఓవర్‌లోడ్ నిర్ధారణ కావడంతో డ్రైవర్లను అదుపులోనికి తీసుకొని విచారణ చేపట్టారు. జిల్లా మైనింగ్ అధికారులకు రిపోర్ట్ చేసినట్లు వేటపాలెం ఎస్ఐ జి సురేష్ తెలిపారు. మూడు లారీలు మార్టూరు నుంచి చీరాలకు ఎర్రమట్టి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, మట్టిని తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మట్టిని స్థానికంగా వేసిన వెంచర్లకు తరలిస్తున్నట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం.

పోలీసుల అదుపులో ఉన్న లారీలు

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పందిళ్లపల్లి ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. దొంగతనం విషయాన్ని గమనించిన సిబ్బంది శు క్రవారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చీరాల రూరల్ సిఐ ఎ మల్లిఖార్జునరావు, వేటపాలెం ఎస్ఐ జి సురేష్ చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం రెండు లక్షల నలభై ఏడు వేల రూపాయలు అపహరణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బందిని సేల్స్‌మేన్, వాచ్‌మెన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. క్లూస్ టీమును రప్పించి వేలిముద్రలను సేకరించారు. క్లూస్ టీమ్ నివేదికను బట్టి విచారణ వేగవంతం చేయనున్నట్లు ఎస్ఐ జి సురేష్ తెలిపారు.

మద్యం షాపును పరిశీలిస్తున్న పోలీసులు

బంగారం చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని హబీబుల్లా జ్యూయలరీ షాప్‌లో ఈ నెల 23వ తేదీన జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. శు క్రవారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచనలతో కేసులో నిందితుడు కొమరే ఏడుకొండలు(26)గా గుర్తించినట్లు తెలిపారు. ఇతనిది త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామంగా నిర్ధారించామన్నారు. అతను ఉన్న సీసీ టీవీ ఫుటేజ్, టెక్నికల్ ఎవిడెన్స్‌ల ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రెండు తులాల బంగారం, 20 తులాల వెండితో పాటు రూ.15,500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిను కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్ఐ కోటయ్య

ఎన్‌టిఆర్ శతజయంతి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి

చిత్రసీమలో రారాజు ఎదిగి ప్రజల నుంచి చాలా తీసుకున్నామని, వారికి కూడా తన వంతుగా ప్రజాసేవ చేయాలని ఉద్దేశంతో విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని వక్తలు అన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రపంచంలో ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన శతజయంతి ఉత్సవాలు జరుపుకొనే అవకాశం ఈతరం వారికి కలగడం శుభపరిణామం అని అన్నారు. స్థానిక గీతా మందిర్‌లో కళా పరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఎన్టీఆర్ శతజయంతి ప్రత్యేక సంచిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై శతజయంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నాగినేని రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎన్టీఆర్ శతజయంతి సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 600కు 587 మార్కులు సాధించిన విద్యార్థిని తన్నీరు లిఖితకు పట్టణానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నర్రా గోపాల్‌రావు నర్రా వెంకటరావు-రంగ నాయకయమ్మల ట్రస్ట్ తరపున రూ.5 వేల నగదు పురస్కారాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు, మన్నే రామారావు, న్యాయవాదులు గొట్టిపాటి శ్రీనివాసరావు, బత్తుల రామకోటయ్య, సుభాష్ బాబు, పిఎసిఆర్ మూర్తి, దివాకర్ దత్తు, డివిఎస్ సత్యనారాయణ, శ్రీకాంత్, సుబ్బయ్య, కోటయ్య, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, కే నాగేశ్వర రావు, ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని స్వర్ణ-రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల మధ్య పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం ఉదయం పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయాన్నే పొలాలకు వెళ్లే కార్మికులు పొలాల్లో ఉన్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కారంచేడు ఎస్ఐ ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆ వ్యక్తి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని అతని బన్నీనిపై వెస్ట్ బెంగాల్ ముద్ర ఉండటంతో ఆ వ్యక్తి బెంగాల్‌కి చెందిన వ్యక్తి అయి ఉంటాడని ఎస్ఐ శ్రీనివాసరావు ప్రజాశక్తికి తెలిపారు.

మా కూతురిని చంపిన వారిని శిక్షించండి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

తమ కూతురు మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె తల్లిదండ్రులు, బంధువులు కోరుతున్నారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన జొన్న వైష్ణవి అనే యువతికి మూడు సంవత్సరాల క్రితం బాపట్ల మండలం నందిరాజు తోటకు చెందిన గోపి అనే వ్యక్తితో వివాహం అయింది. ఇటీవల ఆమెను వరకట్నం కోసం వేధిస్తూ ఉండేవాడని తల్లి ఉప్పాల సుజాత ఆరోపించింది. గురువారం భర్త గోపి, అతని తమ్ముడు, తల్లి కలిసి వైష్ణవిని ఉరి వేసి చంపారని బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట విలేకరులకు తెలిపింది. తన కూతురిని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, గోపి తన కుటుంబానికి బంధువు అయినా కూడా కొంచెం కూడా జాలి లేకుండా ముగ్గురు కలిసి నా కూతురు వైష్ణవిని ఉరివేసి చంపేశారని ఆమె రోదిస్తూ చెప్పారు. వైష్ణవి బంధుమిత్రులంతా బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాపారికి సైబర్ నేరగాడు టోకరా

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని ఓ వస్త్ర దుకాణ యజమానికి సైబర్ నేరగాడు టోకరా వేశాడు. వినియోగదారుడి రూపంలో దుకాణంలోకి ప్రవేశించి రెండు వేల రూపాయల విలువ చేసే బట్టలు శుక్రవారం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత తన అకౌంట్‌కు ఫోన్‌పే ద్వారా ఒక రూపాయి వేయాలని, అదే అకౌంట్‌కు తిరిగి నగదు పంపిస్తానని నమ్మబలికా డు. ఇది నమ్మిన దుకాణ యజమాని తన ఫోన్‌పే ద్వారా ఒక రూపాయి పంపాడు. తర్వాత తన అకౌంట్ నుంచి 87,500 రూపాయల నగదు మాయమైనట్లు దుకాణ యజమాని గుర్తించాడు. దుకాణ యజమాని గుర్తించేలోపే సైబర్ నేరగాడు తన ద్విచక్ర వాహనాన్ని తీసుకొని వస్తానని చెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. తాను మోసపోయానని గ్రహించిన దుకాణ యజమాని పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దగ్ధమైన టైలర్ దుకాణ సామగ్రి

టైలర్ షాపులో మంటలు

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని కేకే కాంప్లెక్స్‌లో ఉన్న డీసెంట్ టైలర్స్ దుకాణంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో పలు ఎలక్ట్రికల్ మిషన్లు, దుస్తులు కాలిపోయాయి. షాపు నుంచి దట్టంగా పొగ వ్యాపిస్తూ ఉండటంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అయితే అప్పటికే షాపులోని కస్టమర్ల బట్టలు, కుట్టుమిషన్లు కాలిపోయాయి. దీంతో షాపు యజమాని తీవ్ర ఆవేదన చెందారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

గృహ నిర్మాణంలో పురోగతికి కృషి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పక్కా గృహాల నిర్మాణాలలో పురోగతి సాధనకు అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్య సాధన సాధ్యమేనని, విధి నిర్వహణ సులువుగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 10,892 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 8,394 గృహాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 2,498 గృహాలు జూలై నెల చివరి నాటికి పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలలో పురోగతి సాధించడానికి మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో వివరాలు తెలుసుకొని నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఒక్కరికీ సగటున అయిదు గృహాల చొప్పున పర్యవేక్షించేలా మండల ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పునాది దిగువన ఉన్న గృహాలను

అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

పునాది స్థాయికి తీసుకువచ్చేలా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. వేమూరు, అమర్తలూరు మండలాలలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో గృహ నిర్మాణ శాఖ ఏఇలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అలాగే వేమూరు, చీరాల, వేటపాలెం మండలాలలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. గృహ నిర్మాణాలలో పురోగతి సాధించడానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. లబ్ధిదారులను చైతన్యపరచడంతోపాటు గృహ నిర్మాణ సామగ్రి సమకూర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న భవనాలకు సంబంధించిన బిల్లులను తక్షణమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు నిర్దేశించిన పది అంశాలలో జూన్ 12వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు.

రెవెన్యూ దస్త్రాల స్వచ్ఛీకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు సమర్థంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. చీరాలలో రీ సర్వే చేసిన భూములలో హద్దురాళ్లు త్వరగా వేయాలని ఆయన సూచించారు. రెవెన్యూ అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మి శివ జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌లో భోజనం వడ్డిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

నిర్విఘ్నంగా అన్న క్యాంటీన్: నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గం బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ బాపట్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తాజాగా శుక్రవారం బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన కాపు అంకమ్మ చౌదరి, ఆయన సతీమణి ఇందిర 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్న క్యాంటీన్‌లో 350 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారానికి అన్న క్యాంటీన్ 208వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ నిర్వహకులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిరుపేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. బాపట్ల ప్రాంతంలో నిరుపేదలకు ఉచితంగా అన్నదానం చేయాలని లక్ష్యంతో ఇక్కడ ప్రారంభించిన అన్న క్యాంటీన్‌కు దాతల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. వారికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇనగంటి గాంధీ, అప్పసాని మహేంద్ర, ఊట్ల రామారావు, బండి సుబ్బారామయ్య, శ్రీనివాసరావు, కరణం విఘ్నేశ్వరరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎస్‌డబ్ల్యుఎఫ్

- చీరాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-చీరాల: చీరాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ చీరాల శాఖ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీలో అక్రమ బదిలీలు ఆపాలని, పేరుకుపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలని, జీతాలతో పాటే ఓటి బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ చీరాల డిపో కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బి శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమ బదిలీ విధానం వలన చీరాలలో 25 మంది కార్మికులు బదిలీ అవుతారని, అందువల్ల ఈ బదిలీలు వెంటనే ఆపాలని పాత పద్ధతుల్ని కొనసాగించాలని కోరారు. అలాగే క్యాడర్ స్ట్రెంత్ పేరుతో అక్రమ బదిలీలను ఆపాలని, ఆర్టీసీకి సంబంధించిన బకాయిలన్నీ ప్రభుత్వం చెల్లించాలని, తక్షణమే ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావుతో పాటు తులసీరావు, బాషా, వైవి రావు, కేబికే రెడ్డి, జై రావు, సిఐటియు నాయకులు పి కొండయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్లను పరిశీలించిన కరణం

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ పరిధిలోని స్వామి వివేకానంద కాలనీలో సిమెంట్ రోడ్లు, వాటర్ పైప్‌లైన్లు, ఎలక్ట్రికల్ లైన్లను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. రామకృష్ణాపురంలోని డ్రైన్లు వెళ్లే మార్గాన్ని పరిశీలించి ఈదురు గాలుల ధాటికి చెట్లు పడి విద్యుత్ స్తంభాలు వైర్లు తెగిపడ్డ ప్రదేశాన్ని పరిశీలించారు. ఏమైనా ప్రమాదం జరిగిందా అని ఆరా తీశారు. విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే నేతాజీ, లేళ్ల శ్రీధర్, దివి జయరావు, కత్తుల దుర్గరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, ఏఈ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి: ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు భరోసా కల్పించే మహానాడుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియాకు ఏలూరి ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే "మహానాడు" అంటే ఒక్క తెలుగుదేశం పార్టీకే కాదు, తెలుగు వారందరికీ పండగేనని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. మే 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో జరిగే టీడీపీ మహానాడు సభను, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను దిగ్విజయం చేయాలని కోరారు. జగన్‌రెడ్డి అరాచక, నిరంకుశ పాలనకు చరమ గీతం పాడాలన్నారు. ఈ మహానాడు చారిత్రక అవసరమని, చరిత్రను తిరగరాస్తుందని అన్నారు. ఈ మహానాడు రాష్ట్ర భవిష్యత్తు, రాష్ట్ర పునర్ నిర్మాణానికి దశాదిశా నిర్దేశించనుందన్నారు. గోదారి జిల్లాల్లో జరిగే ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మహానాడును భగ్నం చేసేందుకు, వైసిపి ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా టీడీపీ కార్యకర్తలు సొంత వాహనాల్లోనైనా మహానాడుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహానాడు విజయవంతమై తీరుతుందని ఏలూరి స్పష్టం చేశారు. 27న ప్రతినిధుల సభ, 28న లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో యువతకు, నిరుద్యోగులకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేయనున్నారని ఏలూరి తెలిపారు.

చేనేత ఉత్పత్తుల కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే

ప్రజాశక్తి-చీరాల

చేనేత ఉత్పత్తుల కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే అని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. ప్రభుత్వమే చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం చీరాల పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గంగయ్య మాట్లాడారు. ప్రభుత్వ విధానాల కారణంగా చేనేత ముడి సరుకుల ధరలు పెరగడం, ప్రభుత్వ సబ్సిడీ లేకపోవడంతో చేనేత ఉత్పత్తులపై పెట్టుబడి పెరిగింది. మరోవైపు ప్రభుత్వం విధించే వివిధ రకాల పన్నుల కారణంగా చేనేత రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. మరోవైపు ఉత్పత్తి అయిన సరుకులను మార్కెట్‌లో కొనేవారు లేరని అన్నారు. గతంలో ఉన్న ఆప్కో ఇప్పుడు లేని కారణంగా చేనేత నిల్వలు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

పేరుకుపోయాయన్నారు. ఈ నేపథ్యంలో తరతరాలుగా చేనేత వృత్తినే ఆధారం చేసుకుని జీవిస్తున్న కుటుంబాల జీవన పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల ఆదుకునేదుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, ముడి సరుకులకు సబ్సిడీ ఇవ్వాలని, చేనేత ఉత్పత్తులపై విధించిన జీఎస్టీని ఎత్తివేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం చీరాల పట్టణ కార్యదర్శి నలతోటి బాబురావు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల పరిశీలనలో భాగంగా, జిల్లా కలెక్టర్ మొదట పంగులూరు సచివాలయం-1ని పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది ఎక్కువమంది సెలవుల్లో వెళ్లటంపై ఆయన ఆరా తీశారు. కంప్యూటర్‌ను పరిశీలించారు. ఆధార్ సెంటర్‌ను కూడా పరిశీలించారు. ఎక్కువమంది అక్కడ నిలబడి ఉండటంతో ఎందుకు ఉన్నారని అడిగాడు. కొత్త జిల్లా అయినందువలన ఆధార్ కార్డులు అప్డేట్ చేయించుకుంటున్నామని చెప్పారు. అనంతరం రైతు భరోసా కేంద్రం-1కి వచ్చి రికార్డులను పరిశీలించారు. మీటింగుల రిజిస్టర్‌ను పరిశీలించి, అందులో సంతకాలు ఏవని, మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డిని, ఏఏఓను ప్రశ్నించారు. ఆర్‌బికే పరిధిలో ఎరువులు ఎన్ని వస్తున్నాయి? ఎన్ని అమ్మారు? ఎన్ని మిగిలాయి? గోడౌన్ ఎక్కడ? అని ప్రశ్నించారు. తరువాత తహశీల్దారు కార్యాలయం చేరి, తహశీల్దారు కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. మండల సర్వేయర్ వినోద్‌ను పిలిచి సర్వే రిపోర్ట్ తీసుకురమ్మని అడిగారు. తహశీల్దారు కార్యాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో రమణమూర్తి, ఆర్ఐ రామకృష్ణ, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాభిప్రాయ సేకరిస్తున్న ఆర్డీవో సరోజిని

గ్రానైట్ క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని కొనిదెన గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 103/పిలోని 0.598 హెక్టార్లలో శ్రీ శ్రీనివాస గ్రానైట్ క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో సరోజిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా క్వారీ ఏర్పాటు విషయంలో గ్రామస్తులు తమ అభిప్రాయం వెల్లడించాలని కోరారు. క్వారీ సమీపంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 40 మంది తమకు గ్రానైట్ క్వారీ ఏర్పాటుపై ఏ విధమైన అభ్యంతరం లేదని అన్నారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటడంతో పాటు వాహనాలు వెళ్లే సమయంలో వాయు కాలుష్యం వెలువడకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పర్యావరణ శాఖ ఈఈ నాగిరెడ్డి మాట్లాడుతూ తమ పరిధిలో ఎక్కడైనా పరిశ్రమలు ఏర్పాటు చేసే విషయంలో దీనికి సంబంధించి చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజల నుండి ప్రజాభిప్రాయం సేకరిస్తామని, వారి నుంచి ఏమైనా అభ్యంతరాలు వ్యక్తం అయితే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. శ్రీ శ్రీనివాస గ్రానైట్ క్వారీ ఏర్పాటుపై పరిసర గ్రామ ప్రజలంతా సానుకూలంగా స్పందించటం అభినందనీయమన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులు సమకూర్చడం లాంటి లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం వచ్చినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని శానంపూడి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం బందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత పేదల జీవన ప్రమాణాల్లో ఈ చట్టం అనేక మౌలికమైన మార్పులు తెచ్చినట్లు తెలిపారు. దీన్ని సహించలేని పేదల వ్యతిరేకులు, పారిశ్రామికవేత్తలు ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ పేదల జీవన ప్రమాణాలను ముందుకు తీసుకు వెళుతున్న ఈ చట్టానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిధులు తగ్గించి క్రమంగా పేదలకు దూరం చేసే చర్యలకు పాల్పడుతుందని

కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

విమర్శించారు. దేశంలోని 707 జిల్లాలు, 7,16 మండలాల్లో సుమారు 30 కోట్ల మంది పైగా గ్రామీణ పేదలకు ఈ చట్టం ఆసరాగా ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రూ. 2.62 లక్షల కోట్లు కేటాయించడం ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తేవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రజలకు కొనుగోలుశక్తి పెంచవచ్చని తెలిపారు. తద్వారా సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లవచ్చని అనేకమంది ఆర్థికవేత్తలు చెబుతున్నారని తెలిపారు. ఈ అంశాలు మోడీ చెవికి ఎక్కటం లేదన్నారు. 2021 కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి లక్ష కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2022 బడ్జెట్‌లో రూ.93 వేల కోట్లకు కుదించినట్లు తెలిపారు. 2023 బడ్జెట్‌లో కేలవం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. ఇందులో పాత బకాయి రూ.10 వేల కోట్లు ఫోనూ రూ. 50 వేల కోట్లు మాత్రమే మిగులుతాయన్నారు. దీంతో పనిచేసిన కూలీలకు సకాలంలో వేతనాలు రాక, చేసిన పనికి డబ్బులు అందక ఉపాధి పనలకు దూరం అవుతారని తెలిపారు. ఆ కారణం చూపి ఉపాధి చట్టం పుట్టిని ముంచేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విమోజన్ మాట్లాడుతూ ఉపాధి హామీ అమలులో కేంద్ర ప్రభుత్వం చేసిన సాంకేతిక మార్పులు కూలీలకు ఉపాధిని దూరం చేసేలా ఉన్నాయన్నారు. రెండు పూటలా , రెండు పూటలా ఫోన్‌లో ఫోటోలు తీయడం కష్టతరమని తెలిపారు. గతంలో పని ప్రదేశంలో మంచినీళ్లు, మజ్జిగ పలుగు, పారా, తట్టా మొదలైన వాటికి ప్రత్యేక ప్రోత్సాహాలు ఇచ్చే వారని తెలిపారు. సమ్మర్ అలవెన్స్ కూడా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం వాటిని రద్దు చేసినట్లు తెలిపారు. వాటిని తిరిగి సాధించుకునేందుకు వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే పోరాటాల్లో కూలీలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి టంగుటూరి రాము పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే రాంబాబు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని తాటిచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మర్ సెష్పల్ క్రికెట్ పోటీలను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు శుక్రవారం పారరంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే రాంబాబు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతోగానో దోహద పడతాయన్నారు. అనంతంర క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే రాంబాబు అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే కొద్ది సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరించారు. తొలుత ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబును క్రికెట్ పోటీల నిర్వహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

59 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండిపి పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 998 పొగాకు బేళ్లను శుక్రవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 939 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 59 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.152, సరాసరి ధర రూ.199.21 పలికింది.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కొండపి

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, డిబేట్, గుడ్ హ్యాండ్ రైటింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత పుస్తకపఠనం, కథలు చెప్పడం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, శ్రీధర్ పాల్గొన్నారు.

పర్మినెంట్ వార్డెన్స్‌ను నియమించాలి

జిల్లా సంక్షేమాధికారికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అధికారుల బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో ఒంగోలులోని హాస్టళ్లకు పర్మినెంట్ వార్డెన్స్‌ను నియమిం చాలని, వారికి అదనపు బాధ్యతలను తొలగించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ శుక్రవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో పలు రకాల విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకోవడం కోసం వచ్చిన విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్ల వసతి, విద్య, ఆహారాన్ని అందించి ప్రయోజకులను చేయడంలో కీలక పాత్ర వహిస్తాయన్నారు. అలాంటి హాస్టళ్లకు కేటాయించే వార్డెన్లకు అదనంగా ఇంకో హాస్టల్ కేటాయించడం, విద్యార్థులకు ఉదయాన్నే బయోమెట్రిక్ పనులతో వార్డెన్లు విద్యార్థుల ప్రవర్తనపై దష్టి సారించలేక పోతున్నారన్నారు. దీంతో విద్యార్థులు ఫెయిల్ అవడం, ఇతర వ్యసనాలకు దగ్గరవు తున్నారన్నారు. ఒంగోలులోని ఎస్సి-2, ఎస్సి-1 కాలేజీ హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్‌ను నియమిం చాలన్నారు. వారికి అదనపు హాస్టల్ బాధ్యతలు రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.ప్రవీణ్ కుమార్ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంత్, హేమంత్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చుక్కల భూములకు విముక్తి

వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రం ప్రభుత్వం రైతులకు చుక్కల భూమిని చుక్కల నుంచి విముక్తి కలిప్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కొండపి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలోని చుక్కల భూమిపై శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కొండపి నియోకవర్గంలో ఆరు మండలాల్లో చుక్కల భూమి కలిగిన రైతులు 4123 మంది ఉన్నట్లు తెలిపారు. వారు ఎ.5146.24 సెంట్లు చుక్కల భూమి కలిగి ఉన్నట్లు తెలిపారు. ఆ భూములను చుక్కల భూముల నిషేధిత భూములు 22(ఎ) (1)(ఈ) జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. తహశీల్దారు మాట్లాడుతూ కొండపి మండలంలో 1726 మంది రైతులు ఎ 2080.21 సెంట్లు భూమి కలిగిఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ సంఘం చైర్మన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రి రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వర్లు, ఆరు మండల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న అశోక్‌బాబు

నాణ్యత తగ్గి.. ధరలు పడిపోయి..

ఆందోళనలో మామిడి రైతులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఈ ఏడాది మామిడి కాయల మార్కెట్ పరిస్థితి రోజురోజుకు తలకిందులవుతుంది. కరోనా తర్వాత మామిడి మార్కెట్ బాగా ఉంటుందని ఊహించారు. పొగ మంచు కారణంగా మామిడి కాయల నాణ్యత తగ్గింది. దీంతో గత నెలలో టన్ను రూ.45 నుంచి రూ.50 వేలు పలికిన మామిడి కాయల ధర భారీగా పడిపోయింది. పొగ మంచు కారణంగా మామిడి కాయల నాణ్యత తగ్గింది. దీంతో ప్రస్తుతం మామిడి కాయల ధర టన్ను రూ. 20 వేల నుంచి 30 వేలకు పడిపోయింది. దీంతో నష్టాలు తప్పవని వ్యాపారులు వాపోతున్నారు.

కుళ్లిపోయిన మామిడి కాయలు

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : డిపిఒ

ప్రజాశక్తి-దొనకొండ

జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు చేపట్టాలేలా చర్యలు తీసుకోవాలని డిపిఒ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై శుక్రవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్ల వద్ద అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలోని వర్మీ కంపోస్ట్ ఎరువు పరిశీలించారు. అనంతరం డిపిఒ మాట్లాడుతూ తీగ జాతి మొక్కలను నాటించి, పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, ఎంపిడిఒ వి.వసంతరావు నాయక్, ఎపిఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శి పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఒ నారాయణరెడ్డి

రైతు భరోసా కేంద్రం సందర్శన

పెద్దారవీడు : మండల పరిధిలోని దేవరాజుగట్టు రైతు భరోసా కేంద్రాన్ని ఎఒ కె.బుజ్జిబాయి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించిన రైతు భరోసా పథకం లబ్ధిదారులు, అనర్హుల జాబితాను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలన్నారు. అనర్హుల జాబితాలో ఉంటే ఎందుకు జాబితాలో ఉందో కారణం కూడా ప్రదర్శించ బడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజుగట్టు వివిఎఎ చిన్న, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామంలో పాలడగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపిఎల్ టి-20 ఆహ్వాన క్రికెట్ పోటీలు వర్షం కారణంగా నిలిచిపోయాయి. ఈ పోటీలను తిరిగి శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు పాలడగు రాజీవ్, మౌనిక దంపతులు, సహనిర్వాహకుడు సందీప్ తెలిపారు. 27న క్వాటర్ ఫైనల్స్, 28న సెమీఫైనల్స్, 20న ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

తాగునీటి బోరు ఏర్పాటు

సిఎస్.పురం : మండల పరిధిలోని అయ్యాలూరివారిపల్లి గ్రామంలో వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ విషయం గురించి గ్రామస్తులు సర్పంచి ముత్యాల భారతి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచి 24 గంటలలోనే తమ సొంత నిధులు రూ.2 లక్షలతో బోర్ వేసి, మోటార్‌ను బిగించి ప్రారంభించారు. గ్రామస్తులకు నీటిని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచి భారతి నారాయణరెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముత్యాల రమణారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇసుక' చెక్‌పోస్టుల్లో తనిఖీ

జరుగుమల్లి : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్‌బాబు శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని పాలేరు నది వెంబడి ఉన్న గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా నివారించడానికి చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన విషయం విధితమే. అడిషనల్ ఎస్‌పి కె. యాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని నందనవనం, కె.బిట్రగుంట, జరుగుమల్లి, చింతలపాలెం, కామేపల్లి గ్రామాలలోని చెక్ పోస్టులను సుధీర్‌బాబు పరిశీలించారు. ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడి టీం సభ్యుడు కె.వంశీధర్, సెబ్ ఎస్ఐ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు వెళ్లిన తమ్ముళ్లు

జరుగుమల్లి : టిడిపి వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా రాజమండ్రిలో టిడిపి ఆధ్వర్యంలో మహానాడు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జరుగుమల్లి మండలానికి చెందిన టిడిపి స్వర్ణ రవిబాబు యువసేన ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆదేశాల మేరకు తాము మహానాడుకు తరలి వెళ్తున్నట్లు రవిబాబు తెలిపారు. మహానాడుకు బయలు దేరిన వారిలో గాలి బ్రహ్మయ్య, ఇడపలపాటి ప్రసాదు, వర్ధినేని బ్రహమయ్య, వర్ధినేని పూరణచంద్రరావు, జ్యోతి బాబు, స్టాలిన్ రాజు వున్నారు.

వర్షితకు అభినందనలు

కొమరోలు : మండల పరిధిలోని ఎర్రగుంట్ల ఎంపిపి పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు చంద్రగిరి శ్రీనివాసులు కుమార్తె చంద్రగిరి వర్షిత తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో 47వ ర్యాంకు సాధించింది. వర్షిత విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్‌ను చదివింది. 1000/978 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో 47వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకును సాధించిన వర్షితను పలువురు అభినందించారు.

చర్చలు సఫలం .. సమ్మె విరమణ..

- కార్మికులకు వేతనం పెంపునకు యాజమానుల అంగీకారం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పారిశ్రామికవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కార్మికులకు పాత వేతన ఒప్పందం ముగిసింది. దీంతో కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని కోరుతూ మార్కాపురం డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. కార్మికుల పోరాటంతో దిగివచ్చిన యజమానులు కార్మికనాయకులతో శుక్రవారం జరిపిన చర్చలు సఫలమైయ్యాయి. నూతన వేతన ఒప్పందం కుదిరింది. దీంతో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ, యూనియన్ కార్యదర్శి పి. రూబెన్ మాట్లాడుతూ ఆపరేటర్‌కు 8 గంటల పనికి రూ. 260 నుంచి రూ. 297 రూపాయలకు పెంచినట్లు తెలిపారు. హెల్పర్‌కు రూ.257 నుంచి రూ. 294 పెంచినట్లు తెలిపారు.

వేతన పెంపుపై కార్మికులకు హామీ ఇస్తున్న యాజమానులు

స్పీట్టర్ కార్మికులకు రూ. 283 నుంచి రూ. 32, క్యాలిబ్రేషన్ కార్మికులకు రూ.131 నుంచి రూ. 150, ముజాక్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 14 శాతం ప్రకారం రూ.18 పెరిగినట్లు తెలిపారు. పిఎఫ్,ఇఎస్ఐ బోనస్ చట్ట పకారం ఇవ్వటానికి యజమానులు అంగీకరించినట్లు తెలిపారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు మధ్యాహ్న భోజనాన్ని క్యాంటీన్ ధర ప్రకారం చెల్లిండానికి అంగీకరించినట్లు తెలిపారు. గతంలో అమలులో ఉన్న ప్రొడక్షన్ మరియు ఇతర అన్ని రకాల సౌకర్యాలు యథావిధిగా అమలు చేయుటకు యాజమానులు అంగీకరించినట్లు తెలిపారు. పెరిగిన వేతనాలు పారిశ్రామిక వాడలోని అన్ని ఫ్యాక్టరీల్లో కచ్చితంగా అమలు చేసే బాధ్యతను తాము తీస కుంటామని రాత పూర్వకంగా యజమానులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్చల్లో యజమానులు తరపున వెన్న పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, మోరా వెంకటేశ్వర రెడ్డి,లక్ష్మీనారాయణ, రామ్స్, యక్కలి కోటి, రమణ, కాపర్‌రెడ్డి చాటకొండ నాగరాజు, తిరుపతయ్య, కందుల వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, రత్నం,ధనరాజ్, కార్మికుల తరపున ఎం. బాల శేషయ్య, టి.రాములు, టి.ప్రకాశం, శేషగిరి, అశోక్, కొండయ్య, ఆదిరెడ్డి, అంజి, కొండలు, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. కొనకనమిట్ల మండలం రేంగు మానుపల్లి సచివాల య పరిధిలోని మర్రిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్ననట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి యద్దనపూడి చిన్నమ్మి, ఎంపిపి మురళికృష్ణ, జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, వైసిపి మండల కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, ఎంపిడిఒ రావూరి జనార్ధన్, సచివాలయ కన్వీనర్లు, గ్రామ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పేదలకు ప్రభుత్వమే ఉచితంగా గృహనిర్మాణాలు చేపట్టాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. టంగుటూరులో అఖిల పక్షం నాయకులతో శు క్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారుల ఇంటి పట్టాలు రద్దు చేస్తామని అధికారులు ద్వారా ఒత్తిడి తేవడం దుర్మార్గమని తెలిపారు. నిరుపేదలకు జగనన్న కాలనీలలో ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు కాలనీలలో మౌళిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. లబ్దిదారుల ఇంటి నివేశన స్థల పట్టాలను ఏకపక్షంగా రద్దు చేస్తే సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ప్రజా పోరాటాలకు పాల్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల అఖిలపక్షం నాయకులు వేసుపోగు మోజెస్, బొడ్డు సతీష్, మొఘల్ కాలేషా బేగ్, టి.ప్రభాకర్, తొట్టెంపూడి దేవ సహాయం, గొల్లకారం రాము పాల్గొన్నారు.

చెరువునే దున్నేశారు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

చెరువును దున్ని చదును చేసిన దృశ్యం

పెద్దదోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామంలో భూగర్భజలాలు పెంచేందుకు, పశువుల దాహార్తి తీర్చేందుకు గతంలో నిర్మించిన వెన్నా పాపిరెడ్డి చెరువు ఆక్రమణకు గురైంది. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి చెరువులోని కొంత స్థలాన్ని ట్రాక్టర్‌తో దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా స్పందన కన్పించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద బొమ్మలాపురం గ్రామంలో 156, 157, 158 సర్వే నెంబర్లలో 97 ఎకరాల విస్తీర్ణంలో వెన్న పాపిరెడ్డి చెరువు ఉంది. గ్రామానికి ఆనుకునే ఉండే చెరువు నిండితేనే నీరు వస్తే ప్రజలకు తాగునీటి సమస్య, పశువులకు దాహార్తి తీరుతుంది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో ఆ చెరువులో నీరు లేక పోవడంతో ఖాళీగా ఉంది. దీంతో ఆక్రమణదారుల కన్ను చెరువుపై పడింది. నాలుగు ఎకరాల పరిధిలోని పిచ్చి చెట్లు తొలగించి మూడు ఎకరాలను ట్రాక్టర్ దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేశారు. ఈ విషయాన్ని గమనించి స్థానికులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి చూసి వెళ్లారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా త్వరలో కొలతలు వేయించి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తామని తెలిపారు.

చెరువును దున్నిన వారిపై చర్యలు తీసుకోవాలి
గాలి వెంకటరామిరెడ్డి

పెద్దబొమ్మలాపురం గ్రామంలో భూగర్భ జలాలు పెంచేందుకు, పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన వెన్నా పాపిరెడ్డి చెరువు ఆక్రమణకు పాల్పడిన అధికార పార్టీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం.

వల్లూరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ అమ్మవారిని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఒంగోలు నగర వైసిపి నాయకులు పటాపంజుల అశోక్ కుమార్ ఆహ్వానం మేరకు బాలినేని వల్లూరుకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వైసిపి కొండపి, చీరాల నియోజకవర్గాల ఇన్ ఛార్జులు వరికూటి అశోక్ బాబు, కరణం వెంకటేష్ బాబు, వైసిపి నాయకులు కూడా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత నాయకులకు దేవస్థానం పాలకవర్గం ఛైర్మన్ కాలే శ్రీనివాసులు, కార్యనిర్వాహణాధికారి బద్దెపూరి రమేష్, అర్చక సిబ్బంది స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పటా పంజుల అశోక్ కుమార్,వారి కుటుంబ సభ్యులు, దేవస్థానం పాలకవర్గం సభ్యులు బాలినేని వెంకటేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా అందని జీతాలు

- అవస్థల్లో కార్మికులు
- అప్పు దొరకక ఆందోళన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేసేది ఒకే పని. జీవనానికి మరో పనంటూ లేదు. చేసే పనికి నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని పనిలోకి రావాలంటూ పారిశుధ్య కార్మికుల ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం భట్టిప్రోలులో సుమారు 30 మంది వరకు పారిశుధ్య కార్మికులు వివిధ రకాల పనులు చేస్తూ ఉంటారు. తాగునీరు విడుదల చెయ్యటం, విద్యుత్ బల్బులు వేయడం, రహదార్ల శుభ్రం చేయుట, మురుగు కాలువలు పూడికతీత పనులు చేపట్టటం వంటి పలు రకాల పనులు చేపడుతూ ఉంటారు. వీరికి ఇచ్చే వేతనం నెలకు రూ.10 వేలు. అది కూడా ప్రతి నెలా ఇవ్వాలని ప్రభుత్వ జిఓలో ఉంది. కానీ ప్రతి నెల కాదు కదా రెండు నెలలకు ఒకసారి కూడా జీతం ఇచ్చే పరిస్థితి లేదు. ఈ నెలాఖరు నాటికి ఏకంగా ఐదు నెలలు పూర్తి కావస్తోంది. అయినా నేటికి జీతాల బిల్లులు పెట్టకపోవటం కార్మికులను మరింత కలవరానికి గురి చేస్తోంది. నెలల తరబడి చిల్లరకొట్టులో అప్పులు ఇవ్వలేమని, డబ్బులు ఇచ్చి సరుకులు తీసుకెళ్లాలని వ్యాపారస్తులు చెప్పటంతో దిక్కుతోచని స్థితిలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు.

గట్టిగా జీతాలు ఇవ్వమని అడగలేని పరిస్థితి

నెలలు గడిచినా ఏదో ఒక బాధ పడుతున్నారే కానీ పంచాయతీ పాలకవర్గానికి జీతాలు ఇవ్వమని గట్టిగా అడిగే

భట్టిప్రోలు సచివాలయం

పరిస్థితి కూడా కార్మికులకు లేకుండాపోయింది. గతంలో నాలుగు నెలల పాటు జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులంతా ఎంపిడిఓను కలిసి విన్నవించారు. ఆ సమయంలో సకాలంలో జీతాలు ఇవ్వలేని పాలకవర్గం జీతాలు అడిగిన కార్మికులను తొలగించేందుకు పూనుకుంది. ఆ సంఘటనతో భయపడిన కార్మికులు జీతాలు లేక ఐదు నెలలు కావస్తున్నా అటు పాలకవర్గాన్ని కానీ, ఇటు అధికారులను గాని గట్టిగా ఎదిగేందుకు జంకుతున్నారు. సుమారు కోటి రూపాయలకు పైగా ఆదాయం ఉన్న భట్టిప్రోలు పంచాయతీలో పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. నిన్న మొన్నటి వరకు శాశ్వత కార్యదర్శి కూడా లేకపోవటం ఒక సమస్యగా మారింది. ప్రస్తుతం పర్మినెంట్ కార్యదర్శి బాధ్యతలు చేపట్టి నెల రోజులు కావస్తున్నా పాలనలో ఎలాంటి మార్పు కనిపించటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

జీతాలు అందక జీవనం కోసం పనికి డుమ్మా

పంచాయతీలో పనిచేసే కార్మికులకు సకాలంలో జీతాలు ఆదకపోవటంతో పలువురు కార్మికులు కుటుంబ పోషణ కోసం ఇతర పనులకు వెళుతూ పంచాయతీ పనికి డుమ్మా కొడుతున్నారు. దీని కారణంగా గ్రామంలో పని చేసే సిబ్బంది తగ్గిపోయి ఎక్కడికక్కడ మురుగు రోడ్లపైన పారుతోంది. రోడ్లు ఊడ్చే వారి సంఖ్య తగ్గి చెత్తా చెదారం పేరుకుపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలో ఇప్పటికే రూ.70 లక్షలకు పైగా పన్నులు, ఇతరత్రా నిధులు ఉన్నట్లుగా తెలిసింది. ఇప్పటికైనా పారిశుధ్య కార్మికుల వేతనాలు అందజేసి గ్రామంలో నెలకొన్న పారిశుధ్య లోపం నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల వేతనాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జీతాలు అందక కొందరు సెలవు పెట్టి పనిలోకి రాకపోవటంతో పారిశుధ్యం లోపించిన మాట వాస్తవమేనన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: వెంకటేష్

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో గ్రామ వాలంటీర్ల పురస్కారాల ప్రదానోత్సవం సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్‌బాబు మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా వాలంటీర్ల చేసిన సేవలను కొనియాడారు. సేవా వజ్ర వాలంటీర్లు షేక్ హుమాయిన్‌బాషా, బొల్లపల్లి కీర్తనలను వెంకటేష్‌బాబు దుశ్శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. ఐదు సేవా రత్నాలు, 399 సేవా మిత్రలకు ప్రసంశా పత్రాలు అందించినట్లు వివరించారు. వీరందరికి ఆయా గ్రామాల వైసిపి నాయకుల ను, సచివాలయ సెక్రటరీలను స్టేజ్ పైకి పిలిచి వారి ద్వారా వెంకటేష్‌బాబు అందించారు. ఉదయం

పురస్కారాలు అందజేస్తున్న కరణం వెంకటేష్

పది గంటలకు కార్యక్రమం ఉండడంతో వేటపాలెం మండల స్పెషల్ ఆఫీసర్ రాజ దెబోరా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ, మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం, వెలుగు ఎపిఎం బూదాటి శ్రీనివాసరావు, ఆర్‌బికె ఛైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఎంపిడిఒ సీనియర్ అసిస్టెంట్ జయరాజ్, రామన్నపేట సర్పంచ్ కె రమణ, ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, పృథ్వీ చంద్రమోహన్, జంగిలి రామారావు, ఆవుల అశోక్, రొండా భరత్ పాల్గొన్నారు.

స్వరూపాల ప్రతిష్టకు రూ.60 వేల సాయం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలో ఏసుక్రీస్తు మరియమ్మ తల్లి స్వరూపాల ప్రతిష్ట మూడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి బాపట్లకు చెందిన ఆర్మీ విజయ్ రూ.60 వేలు విరాళాన్ని నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మీ విజయ్ మాట్లాడుతూ సేవ, దైవ కార్యక్రమాలను పురస్కరించుకొని అన్నదానానికి ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. సమాజసేవకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నరసాయపాలెం ఎస్సీ కాలనీ అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తామన్నారు. మానవుడికి డబ్బు ప్రధానం కాదన్నారు. సమాజ సేవకు చేసే మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. దళిత యువకులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ యువత సద్వినియోగం చేసుకోవడం లేదని అన్నారు. తరతరాలుగా దళితులు ఆర్థికంగా

విరాళం అందిస్తున్న ఆర్మీ విజయ్

వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ప్రతి గ్రామంలో దళిత సోదరులు ఐక్యతతో కలిసిమెలిసి జీవించాలని సూచించారు. రాజకీయాలు వ్యక్తిగతమన్నారు. గ్రామ అభివృద్ధి విషయంలో పార్టీలకు తావు లేకుండా సమిష్టిగా అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాసి సుదర్శనరావు, ఎంపీటీసీ దేవరపల్లి రవికుమార్, సతీష్, దేవరపల్లి చిలకయ్య, సిద్దయ్య, బత్తుల యేషయ్య, పూర్ణచంద్రరావు, శ్రీరామ్, గుడిపూడి జోసెఫ్ పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి: నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడును ఈ నెల 27, 28న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం తెలిపారు. మహానాడుకు బాపట్ల నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటలకు బాపట్ల టిడీపీ కార్యాలయం వద్ద నుంచి నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లే బస్సులు బయలుదేరుతాయన్నారు. బాపట్ల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి మహానాడును విజయవంతం చేయాలని నరేంద్రవర్మ కోరారు.

ఇసుక తోడేస్తున్నారు..

ప్రజాశక్తి-కొల్లూరు: కొల్లూరు మండల పరిధిలోని గాజులంక చిలుమూరు ఇసుక క్వారీలు నుంచి అడ్డగోలుగా ఇసుకను పెద్ద పెద్ద లారీలు పెట్టి తవ్వి వైసిపి నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారని జనసేన నాయకులు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇసుక రీచ్‌ల పర్మిషన్ ఈ నెల రెండో తేదీకే ముగిసిపోయినా వైసీపీ నాయకు లు మాత్రం ఇసుక తవ్వకాలు ఆపడం లేదని వారు అన్నారు. ఈ నియోజకవర్గ మంత్రికి రోడ్లు వేయటం చేతకాదు గాని ఇసుకను తవ్వుకుని జేబులు నింపుకోవడం తెలుసని వారు అన్నారు. వాళ్ళ నాయకుడు తమ నాయకుడిని దత్తపుత్రుడు అంటాడని, కానీ అవినీతి దత్తపుత్రులు వైసీపీ నాయకులు అని వారు పేర్కొన్నారు. ఇసుక రీచ్ పర్మిషన్‌ను కోర్టు కూడా కొట్టేసిందని, అయినా యధేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకాలను అడ్డుకుంటామని, అన్యాయాలకు భయపడేది లేదని వారు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మొదటి సంవత్సరం శుక్రవారం మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలను జిల్లాలోని 72 కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు సాధారణ కోర్సులకు 11,779 మందిని కేటాయించగా 10,565 మంది విద్యార్థులు హాజరు కాగా 1214 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు 824 మందిని కేటాయించగా 704 మంది విద్యార్థులు హాజరు కాగా 120 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పర్యవేక్షణ అధికారి ఏ సైమన్ విక్టర్ మూడు పరీక్షా కేంద్రాలను, డిఇసి సభ్యులు, డివిఇఒ, హైపవర్ కమిటీ సభ్యులు 6 కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్స్ 17 కేంద్రాలను, పరీక్షల పరిశీలకులు చీరాల పట్టణంలోని ఒక పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

599 మంది విద్యార్థులు గైర్హాజరు

ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలలో సాధారణ, ఒకేషనల్ కోర్సులలో 599 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం మ్యాథ్స్, బొటనీ, సివిక్స్-2 పరీక్షలను 72 కేంద్రాలలో నిర్వహించారు. సాధారణ కోర్సులకు 4431 మందిని కేటాయించగా 3906 మంది విద్యార్థులు హాజరు కాగా 525 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు 464 మందిని కేటాయించగా 390 మంది హాజరు కాగా 74 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారు. ఒంగోలు శ్రీ చైతన్య కళాశాలలో 3 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. ఇంటర్మీడియట్ పర్యవేక్షణ అధికారి ఏ.సైమన్ విక్టర్ మూడు పరీక్షా కేంద్రాలను, డిఇసి సభ్యులు, డివిఇఒ, హైపవర్ కమిటీ సభ్యులు 63 కేంద్రాలను తనిఖీ చేశారు.

సంతరావూరులో గిలకల మండపం వద్ద ప్రారభమైన కొలుపులు

కనకనాగవరపమ్మ కొలుపులు ప్రారంభం

గిలకల మండపం వద్ద నిదిపైకి వచ్చిన అమ్మవారు

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలోని శ్రీకనకనాగవరపమ్మ 38 తిరునాళ్ల కొలుపులు సంతరావులరులో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. సంతరావూరులోని మీసాల బాబురావు ఇంటి వద్ద గిలకల మండపం వద్ద అమ్మవారు నిధిపైకి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి అమ్మవారి చరిత్రను జానపద గేయాల రూపంలో ఆలపించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు కొబ్బరికాయలు కొట్టి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. 27 శనివారం నాయిని శేషగిరి ఇంటి వద్ద నుంచి పావనం తీసుకొని కొత్తగొర్ల దేవరిల్లు నుంచి అమ్మవారు సముద్ర స్నానానికి బయలుదేరునని ఇఓ జివిఎల్ కుమార్ తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు వివిధ రూపాల్లో అమ్మవారి కొలుపులు కన్నుల పండుగగా జరుగుతాయన్నారు. 3వ తేదీ ఏరువాక పౌర్ణమికి అమ్మవారి తిరునాళ్ల జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటలు

నష్టపరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని పాతర్లంక శివారు గ్రామాలైన తోకలవారిపాలెం, కష్ణనగర్, తిప్పలకట్ట, జువ్వలపాలెం మొదలైన గ్రామాలలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో వడగండ్ల వర్షాలు కురవడంతో లంక గ్రామాలలో సాగుచేసిన వాణిజ్య పంటలైన అరటి, తమలపాకు, మామిడి, జామ తోటలు దెబ్బతిన్నాయి. జామ, మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు అకాల వర్షాలు, గాలుల వలన పడిపోయి రైతులను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది. పంటలు చేతికి వచ్చే దశలో ఈ పరిణామాలు రైతులను కృంగదీశాయి. పసుపు, మొక్కజొన్న పంటలు కల్లాల్లోనే ఉన్నాయి. గురువారం కురిసిన భారీ వర్షాలకు ఈ పంటలు తడిసిపోయాయి. పోయిన సంవత్సరం ఇదే మే నెలలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించలేదు. నష్టపోయిన పంటలను అధికారులు పరిశీలించి పడిపోయిన అరటి, తమలపాకు, జామ, మామిడి పొలాలను నమోదు చేసుకుని రైతులకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. తడిసిన మొక్కజొన్న, పసుపు పంటలను ప్రభుత్వమే మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని కోరారు. అరటి, తమలపాకు, పసుపు పంటలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలని రైతు సంఘం నాయకులు టి కృష్ణమోహన్, వేములపల్లి వెంకటరామయ్య, బొనిగల సుబ్బారావు ఎమ్మార్వోను కలిసి వినతిపత్రం అందించారు.

ఎస్‌సి కాలనీ సందర్శన

ప్రజాశక్తి-యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామ ఎస్‌సి కాలనీని సమతా సైనిక్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఇటీవల రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం గురించి కాలనీ వాసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలనీ వాసులకు అండగా ఉంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ బాషా, సమతా సైనిక్ పర్చూరు నియోజకవర్గ కన్వీనర్ బెంజిమెన్, మండల కన్వీనర్ రాజశేఖర్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి ఇర్మియా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు రుణపడి ఉండాలి

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌కు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెంలో శుక్రవారం పర్యటించిన మంత్రి సురేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ప్రజలంతా అండగా నిలవాలన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి మందా లాజరు, జడ్పిటిసి వాగ్యా నాయక్, ఎంపిటిసి లింగం గుంట్ల రాములు, మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, సుద్దకురవ తాండా సర్పంచ్ బి వెంకటేశ్వర్లు నాయక్, డిఎల్‌డివో బివిఎన్ సాయి కుమార్, తహశీల్దార్ దాసు, నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'గడపగడపకూ..'లో మంత్రి సురేష్

జగనన్న గృహనిర్మాణాలు వేగవంతం

అధికారులకు జేసీ శ్రీనివాసులు ఆదేశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం యర్రగొండపాలెం సమీపంలోని జగనన్న కాలనీ లే అవుట్‌లో హౌసింగ్ డే నిర్వహించారు. జగనన్న కాలనీ లౌ అవుట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ డి శ్రీనివాసులు మాట్లాడుతూ లబ్ధిదారులు గహ నిర్మాణాలను వేగవంతంగా నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈ వెంకటస్వామి, డీఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డిఎల్‌డివో సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, ఇంచార్జి తహశీల్దార్ దాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ

ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-రేపల్లె

కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు మెరుగుపరచాలని, రేపల్లె పట్టణంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తహశీల్దారు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ డి.మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, రేపల్లె తాలూకా రైస్ మిల్ ముఠా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు వి సుబ్బారావు, కార్యదర్శి యు రామకృష్ణ ప్రసాద్, సిఐటియు నాయకులు కె.ఆశీర్వాదం, రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

ఒంగోలులో అర్జీ ఇస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్: ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు కోరారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ అధ్వర్యంలో ఒంగోలు ఇఎస్ఐ మేనేజర్ సుధీర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, జిల్లా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి బత్తుల గోపి, జిల్లా నాయకుడు ఎం.వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చీరాల: ఈఎస్ఐ పథకాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తూ ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకున్నాయని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చీరాల ఈఎస్ఐ డిస్పెన్సరీ డాక్టర్ జంగిలి శ్రీనివాసరావుకు సిఐటియు చీరాల పట్టణ కమిటీ తరపున ఈఎస్ఐ ఉన్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాబురావు, ఎం.వసంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం.వసంతరావు, వీరాంజనేయులు, రామారావు పాల్గొన్నారు.

రేపల్లెలో ధర్నా చేస్తున్న నాయకులు

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 67 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో చెన్నైకి చెందిన సైట్ స్పెక్ట్రమ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 67 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి మొదటి సంవత్సరం 2.4 లక్షలు, 2వ సంవత్సరం 4.8 లక్షలు , 3 వ సంవత్సరం 6 లక్షలు వేతనంగా లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు, ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడారు. విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ఉచిత కోచింగ్‌ని ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి , ఏఒ ర్యాంకర్స్ శ్రీనివాస్, ధీరేష్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఓపీ విభాగాల్లో..

మహిళల టాయ్‌లెట్స్ మూసేశారు!

ఇబ్బందులు పడుతున్న మహిళా పేషెంట్లు, సహాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) ఓపీ విభాగాల్లో మహిళల టాయ్‌లెట్స్‌ను మూసేయడంతో ఆసుపత్రికి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొర సౌకర్యాలతో అయినా పురుషుల టాయ్‌లెట్స్ తెరిచి ఉంచగా.. మహిళల టాయ్‌లెట్స్ మాత్రం పూర్తిగా మూసేశారు. జీజీహెచ్‌కు ఎక్కువగా దూరప్రాంతం నుంచి రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. ఇక్కడ మహిళలకు టాయ్‌లెట్స్ సరిగా లేకపోవడంతో అత్యసరమైనప్పుడు ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని అడగాలో అర్థంకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూపర్‌స్పెషాలిటీ ఓపీ విభాగం, ఆర్థో ఓపీ విభాగం, మానసిక వైద్య ఓపీ విభాగాలను శుక్రవారం 'ప్రజాశక్తి' పరిశీలించగా.. ఈ మూడు విభాగాల్లో పురుషుల టాయ్‌లెట్స్ తెరిచి ఉన్నాయి. మహిళల టాయ్‌లెట్స్ మాత్రం మూడూ పూర్తిగా మూసేసి ఉన్నాయి. సూపర్‌స్పెషాలిటీ ఓపీ విభాగం(మూడో నెంబర్) వద్ద మహిళల టాయ్‌లెట్స్‌ను మూసేయడమే కాక అటు వైపు ఎవరూ వెళ్లకుండా ఆసుపత్రికి సంబంధించిన ఇనుప స్టాండ్లను అడ్డుగా పెట్టారు. ఆర్థో, మానసిక వైద్య ఓపీ విభాగాలలో మహిళల టాయ్‌లెట్స్ తలుపు గడులను తాళ్లతో బిగించేశారు. టాయ్‌లెట్స్‌కని అక్కడి దాకా వెళ్లిన మహిళలు అవి బంద్ చేసి ఉండటంతో అవస్థలు పడుతున్నారు. పురుషుల టాయ్‌లెట్స్ తెరిచే ఉన్నా.. వాటి నిర్వహణ సరిగ్గా లేదు. రిమ్స్ అధికారులు స్పందించి.. టాయ్‌లెట్స్‌ను మహిళలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని పేషెంట్లు కోరుతున్నారు. దీనిపై రిమ్స్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్‌ను వివరణ కోరగా.. మహిళల టాయ్‌లెట్స్‌ను బాగు చేయించి.. అందుబాటులో ఉంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్థో, మానసిక వైద్య ఓపీ విభాగాలలో ఉన్న టాయ్‌లెట్స్ తలుపుల గడులను కట్టేసిన దృశ్యం

సూపర్‌స్పెషాలిటీ ఓపీ విభాగంలో మహిళల టాయ్‌లెట్‌కు అడ్డంగా ఉంచిన ఇనుప స్టాండ్‌లు

'అరోమా'తో రైతుల ఆర్థిక స్థితి మెరుగు

రమాకాంత్ హర్లాల్కా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అరోమా పంటల సాగుతో రైతుల ఆర్థిక స్థితి గణనీయంగా మెరుగవుతుందని నిషాంత్ అరోమా మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్ హర్లాల్కా తెలిపారు. సుగంధ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా అవగాహన కల్పించడానికి ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ దేశంలో సుగంధ పంటల సాగును పెంచేలా కేంద్ర ప్రభుత్వం "అరోమా మిషన్" పేర ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. గురువారమే జిల్లాకు వచ్చిన ఆయన చీమకుర్తి, కొత్తపట్నం మండలాలలో పర్యటించి సుగంధ పంటలు సాగు చేస్తున్న తీరును పరిశీలించారు. జిల్లాలో నిమ్మ గడ్డి (లెమన్ గ్రాస్), కాశగడ్డి (పామరోజు), కామాక్షి కసువు (సిట్రోనెల్లా). వట్టివేరు సుగంధ పంటల సాగుకు విస్తారమైన . అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏపిఎంఎపిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రా రెడ్డి, సిఐఎంఎపి సీనియర్ శాస్త్రవేత్తలు కిరణ్‌బాబు, సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలని దీక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేర్చాలని, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపిజిఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ సంఘం వైపాలెం తాలూకా యూనిట్ అధ్యక్షుడు షేక్ జానీబాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ మసూద్, అసోసియేట్ అధ్యక్షుడు పి ముత్యం, కోశాధికారి రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాట్లు కొనుగోలుదారులకు శుభవార్త

మార్కాపురం మండలం రాయవరం గ్రామ సమీపంలో 52 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతోన్న 'ప్రభుత్వ మెడికల్ కళాశాల'కు అతి దగ్గరలో జాతీయ రహదారి ఆనుకుని (మార్కాపురం–ఒంగోలు) గల ప్లాట్లు సరసమైన ధరలకు లభించును. ఎకరం, అర్థ ఎకరం, 25 సెంట్లు మరియు ప్లాట్లుగా కూడా లభించును. గమనిక: ప్లాటు కొనుగోలుదారులు తిరిగి అమ్ముకోదలిచినచో 5 సంవత్సరాలకు రెట్టింపు పైకం ఇవ్వబడును. ప్లాటు కొనుగోలుదారులకు కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మనవి.

సంప్రదించాల్సిన
సెల్ నెంబర్: 9959746639.